

# చదువు

## ప్రవేశానికి అధికారిక అనుమతి

ఎవరైనా తమది కాని దేశంలోకి ప్రవేశించాలంటే అక్కడి ప్రభుత్వం నుంచి అధికారికంగా అనుమతి పొందాల్సి ఉంటుంది. ప్రవేశ అనుమతిని అభ్యర్థిస్తూ చేసే దరఖాస్తును ఆ దేశపు ఇమిగ్రేషన్ అధికారులు పరిశీలిస్తారు. నిబంధనల ప్రకారం ఉన్న దరఖాస్తుదారుడికి మంజూరు చేసే అధికారిక ప్రవేశ అనుమతినే 'వీసా' అంటారు. సాధారణంగా అమెరికాకు ఉన్నతవిద్యకు వెళ్లే విద్యార్థులకు ఎఫ్-1 (నాన్-ఇమిగ్రెంట్) వీసా ఇస్తారు. యూఎస్ ప్రభుత్వం నుంచి అక్రెడిటేషన్ పొందిన యూనివర్సిటీల్లో అడ్మిషన్ పొందినవారికి ఈ వీసా లభిస్తుంది.






### టౌన్‌ప్లానింగ్ చేయాలంటే..

**? ఎంఎస్సీ (జాగ్రఫీ) చేశాను. టౌన్ ప్లానింగ్ కోర్సులు చేయాలనుంది. వీటిని అందించే విశ్వవిద్యాలయాలతో పాటు అర్హత, నోటిఫికేషన్ల సమాచారాన్నీ అందించండి.** - *శ్రీను*

జ: ప్రపంచంలోనే రెండో అతిపెద్ద పట్టణ వ్యవస్థ ఉన్నది మనదేశంలోనే. 2025 నాటికి దేశంలో సగం జనాభా పట్టణాల్లో నివసిస్తుందని ఒక సర్వే తెలియజేస్తోంది. మితిమీరిన పట్టణీకరణ రవాణా, పేదరికం, నిరుద్యోగం, మురికివాడలు, అనధికార గృహ కాలనీలు వంటి వివిధ సవాళ్లను ముందుకు తీసుకొస్తోంది. టౌన్ ప్లానర్ ముఖ్య విధి- వైవిధ్యంగా, అందరికీ అనుకూలమైన నగర ప్రణాళికను రూపొందించడమే.



కోర్సుల విషయానికొస్తే.. ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) వారు పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ అర్బన్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కోర్సును అందిస్తున్నారు. ద గ్లోబల్ ఓపెన్ యూనివర్సిటీ, నాగాలాండ్ వారు ఎంఎస్సీ ఇన్ అర్బన్ ప్లానింగ్ కోర్సును అందిస్తున్నారు. ఏదైనా డిగ్రీ పూర్తిచేసినవారు ఈ కోర్సులు చదవడానికి అర్హులు. మరిన్ని వివరాలకు ignou.ac.in ను సందర్శించవచ్చు.

### ఫోరెన్సిక్ సైన్సా... ఇంగ్లిషా?

**? మా అమ్మాయి ఇంటర్ (ఎంపీసీ) చదువుతోంది. తనకు ఫోరెన్సిక్ సైన్స్‌లో కానీ, ఆంగ్లంలో కానీ పై చదువులు చదవాలనుంది. ఏది మేలు? అందించే సంస్థల వివరాలను తెలపండి.** - *శ్రీనివాసరావు*

**జ:** నేర పరిశోధన పట్ల ఆసక్తి, ప్రతి విషయాన్ని నిశితంగా పరిశీలించే, వివిధ కోణాల్లో సమస్యలను సాధించే నేర్పు ఉంటే ఫోరెన్సిక్ సైన్స్ కోర్సును ఎంచుకోవచ్చు. డిగ్రీ స్థాయిలో బీఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్ కోర్సును అమిటీ యూనివర్సిటీ, గల్గోతియా యూనివర్సిటీ, డాక్టర్ హరిసింగ్ గౌర్ యూనివర్సిటీ, తెలుగు రాష్ట్రాల్లో.. రాజా బహదూర్ వెంకట్ రామ్‌రెడ్డి ఉమెన్స్ కళాశాల అందిస్తున్నాయి.



ఆంగ్లంలో పై చదువులకు.. భాషపై ఆసక్తి ఉంటే సరిపోతుంది. ఆంగ్లంలో డిగ్రీ చేయాలనుకుంటే బీఏ (లిటరేచర్), లింగ్విస్టిక్స్, కంపారిటివ్ లిటరేచర్, ట్రాన్స్‌లేషన్ స్టడీస్ ఇన్ ఇంగ్లిష్ కోర్సులను ఎంచుకోవచ్చు. మనదేశంలో ఇఫ్లూ (ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, సెయింట్ స్టీఫెన్స్ కాలేజ్, దిల్లీ వంటి ప్రముఖ సంస్థలు అందిస్తున్నాయి. ప్రతీ కోర్సుకూ తనదైన ప్రత్యేకత ఉంటుంది. దానికి తగ్గ అవకాశాలూ తప్పనిసరిగా ఉంటాయి. మీ అమ్మాయికి దేనిపై ఎక్కువ ఆసక్తి ఉంటే దాన్ని ఎంచుకోమనండి.

### సైకాలజీ అంటే ఇష్టం

**? ఎంబీఏ చేశాను. మనో విజ్ఞాన శాస్త్రం (సైకాలజీ)పై ఆసక్తి ఉంది. దూరవిద్య ద్వారా చేద్దామనుకుంటున్నాను. కుదురుతుందా? అందించే విశ్వవిద్యాలయాలేవి?** - *బి.వి. రామలక్ష్మి*



**జ:** ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన వారు సైకాలజీలో పీజీ చేయడానికి అర్హులు. దూరవిద్యలో దీన్ని అభ్యసించే అవకాశముంది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు; ఎస్‌వీ యూనివర్సిటీ, తిరుపతి; ఆంధ్రా విశ్వవిద్యాలయం, విశాఖపట్నం; ఉస్మానియా యూనివర్సిటీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, హైదరాబాద్ సంస్థలు సైకాలజీలో పీజీ కోర్సులను అందిస్తున్నాయి. మీరు ఎంబీఏలో హెచ్ఆర్ స్పెషలైజేషన్ చేసివుంటే ఈ కోర్సు మీకు మరింత అవగాహన పెంచుకోవడంలో తోడ్పడుతుంది.

● *ప్రొ.బి. రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్*



# యూఎస్ వీసా విజయోస్తు!

**విద్యాభ్యాసం కోసం ఇతర దేశాలకు వెళ్ళే విద్యార్థులు కీలకంగా భావించే ఘట్టం వీసా మంజూరు. అమెరికాలాంటి దేశాలు ఈ ప్రక్రియను క్లిష్టతరం చేయటం మూలంగా కొద్ది సంవత్సరాలుగా మన విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారు. తగిన అవగాహన, ముందస్తు సన్నద్ధత ఏర్పరచుకుంటే వీసా విజయం సులువే!**

డిసెంబరు వచ్చిందంటే వీసా హడావుడి మొదలవుతుంది. అమెరికాలాంటి దేశాలకు ఉన్నతవిద్య కోసం వెళ్ళాలనుకునే విద్యార్థులు దీనికి తగిన సన్నాహాల్లో ఉంటారు. ఎందుకంటే... అక్కడి చాలా విశ్వవిద్యాలయాల్లో స్ప్రింగ్ ప్రవేశాలు ఆరంభమయ్యేది జనవరి నెల్లోనే!



**శుభకర్ ఆలపాటి, డైరెక్టర్, గ్లోబల్ ట్రీ**

విద్యార్థులు తమకు ప్రవేశాలు లభించిన విశ్వవిద్యాలయాల్లోంచి ఒకదాన్ని ఎంచుకోవటం మొదటి మెట్టు. తర్వాత దృష్టిపెట్టాల్సినవి- ఫండింగ్, డాక్యుమెంట్లు; వీసా స్లాట్ బుకింగ్, ఇతర అంశాలు.

## 1 విశ్వవిద్యాలయ ఎంపిక

మన భారతీయ విద్యార్థులు ఐదారు విశ్వవిద్యాలయాలకు దరఖాస్తు చేస్తుంటారు. ఎందుకంటే యు.ఎస్. విద్యాసంస్థల్లో ప్రవేశం పొందటం ఎంతో పోటీతో కూడుకున్న విషయం. చేరదల్చుకున్న యూనివర్సిటీ గుర్తింపు తదితర అంశాలను తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలి. అక్కడ ప్రవేశం ఖరారు చేసే ఫ్యాకల్టీ .. అందిన దరఖాస్తుల సంఖ్య, సీట్ల లభ్యత మొదలైనవాటిని బేరీజు వేసుకుని నిర్ణయం ప్రకటిస్తుంది.

పొందిన అడ్మిట్స్‌లో ఏ విశ్వవిద్యాలయానికి సంబంధించినది ఎంచుకోవాలో నిర్ణయించుకోవటం విద్యార్థులకూ, వారి తల్లిదండ్రులకూ సవాలు. ఈ నిర్ణయానికి ముందు పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలు:

- విద్యార్థి ప్రొఫైల్‌ను బట్టి ఆ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేయటానికి వీసా వచ్చే అవకాశముందా?
- విద్యార్థి ఆసక్తికి అనుగుణమైన కరిక్యులమ్ అందించే కోర్సేనా?
- విశ్వవిద్యాలయం ఉన్న ప్రాంతం అనుకూలమైనదేనా?
- భారతీయ విద్యార్థులకు భద్రతనిచ్చే విద్యా సంస్థగా పేరుందా?
- అభ్యర్థి ఆర్థిక పరిస్థితులకు అనువైన ట్యూషన్ ఫీజును వసూలు చేసే విద్యా సంస్థేనా?
- వాతావరణ పరిస్థితులు అనుకూలమేనా?
- గ్రాడ్యుయేట్ /టీచింగ్ అసిస్టెంట్‌షిప్/ స్కాలర్‌షిప్ లభిస్తుందా?
- యూనివర్సిటీ ప్రాంతంలో జీవన వ్యయం అనుకూలంగా ఉందా?
- ఆ యూనివర్సిటీలో పరిశోధన కార్యకలాపాలు ఎలా ఉన్నాయి?

### లిక్విడ్ ఫండ్స్‌గా ఏం ఉండొచ్చంటే...

1. ఫిక్స్‌డ్ డిపాజిట్లు (కనీసం ఆరు నెలల క్రితం చేసినవి) 2. బ్యాంక్ బ్యాలెన్స్ మొత్తం (అప్పటికప్పుడు జమచేసినవి కావు)
3. విద్యారుణం 4. పోస్టల్ బాండ్స్
5. ప్రభుత్వం లేదా సంస్థల నుంచి పొందే ఫండింగ్ లేదా స్కాలర్‌షిప్‌లు.

### ఫిక్స్‌డ్ అసెట్స్ అంటే..

ప్లాట్లు, ఫ్లాట్లు, ఇల్లు, స్థలాలు, పొలాలు (పొలాల విషయంలో గ్రామ ఎంఆర్ఓ నుంచి సర్టిఫికెట్ తప్పనిసరి).

### వార్షికాదాయం అంటే..

వేతనాల ఆదాయం, వ్యాపార ఆదాయం, వ్యవసాయ ఆదాయం, అద్దెలు, ఇతర ఆదాయాలు.

ఏడాదికి రూ.ఆరు లక్షలు, అంతకుమించి ఆదాయం ఉంటే తప్పక వీసా పొందే అవకాశాలు పెరుగుతాయి.

ఫండ్లు, ఆదాయం పైన పేర్కొన్న వనరుల




నుంచి ఉమ్మడిగా లేదా ఏదో ఒకదాని నుంచి వచ్చేలా ఉన్నా మంచిదే. యూఎస్ఏలో విద్యనభ్యసించడానికి విద్యార్థికి పటిష్ఠమైన ఆర్థిక వనరులు ఉండాలని వీసా అధికారులు ఆశిస్తారు. ఎక్కువ మొత్తంలో నిధులు ఉండటం మంచిదే కానీ, తప్పనిసరి మాత్రం కాదు.

## 2 స్లాట్ బుకింగ్

వీసా స్లాట్ నమోదుకు ముందు విద్యార్థి డీఎస్-160 ఫారాన్ని ఆన్‌లైన్‌లో పూరించాల్సి ఉంటుంది. ఇది https://ceac.state.gov/genniv/ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. సీఈఏసీ బార్ కోడ్ సంఖ్య ఉన్న కన్ఫర్మేషన్ పేజ్‌ను విద్యార్థి తప్పనిసరిగా ప్రింట్ తీసుకోవాలి. వీసా ఫీజు చెల్లించడానికీ, వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్ షెడ్యూల్‌కూ ఈ సంఖ్య తప్పనిసరి.

### ఫీజు చెల్లింపులోని అంచెలు

http://www.ustraveldocs.com/in/index.html?firstTime=No లో వ్యక్తిగత, పాస్‌పోర్ట్, ఎస్ఈవీఐఎస్, చిరునామా వివరాలు, డీఎస్-160 ఫారం ఖరారు సంఖ్యతో కూడిన వివరాలతో అకౌంట్ తయారు చేసుకోవాలి. ఈ వివరాలన్నీ ఇచ్చాక వీసా ఫీజును చెల్లించే విధానం గురించిన ఆప్షన్ లభిస్తుంది.

వీసా ఫీజును 4 విధానాల్లో చెల్లించవచ్చు. 1. నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్) 2. మొబైల్ పేమెంట్స్- ఐఎంపీఎస్ 3. క్యాష్- డీఆర్‌యూకే బ్యాంకు కౌంటర్‌లో 4. క్యాష్- ఆక్సిస్ బ్యాంక్, సిటీ బ్యాంక్ కౌంటర్లు

ఈ నాలుగు విధానాల్లో ఏదో ఒకదాని ద్వారా విద్యార్థులు ఫీజును చెల్లించి, రశీదు సంఖ్యను పొందవచ్చు. 24 గంటల్లో వీసా అపాయింట్‌మెంట్‌ను నమోదు చేసుకోవడానికి ఆక్టివేట్ అవుతుంది. వీసా అపాయింట్‌మెంట్ తేదీకి ముందు ఓఎఫ్‌సీ సెంటర్‌లో వేలిముద్రలు ఇవ్వడానికి అపాయింట్‌మెంట్‌ను తీసుకోవాల్సి ఉంటుంది.

### ఓఎఫ్‌సీ సెంటర్‌కు తీసుకెళ్లాల్సిన పత్రాలు

పాత, కొత్త పాస్‌పోర్ట్, ఐ-20, డీఎస్-160 కన్ఫర్మేషన్ పేజీ, అపాయింట్‌మెంట్ కన్ఫర్మేషన్ లేఖ, వీసా ఫీజు రశీదు.

వీసా ఇంటర్వ్యూకు వెళ్లేముందు విద్యార్థులు www.fmjfee.com ద్వారా ఎస్ఈవీఐఎస్ ఫీజు- 200 డాలర్లను చెల్లించాల్సి ఉంటుంది.

### ఇంటర్వ్యూకు తీసుకువెళ్లాల్సినవి

- పదోతరగతి (ఒరిజినల్)
- ఇంటర్/12 (ఒరిజినల్)
- గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్లు (మార్క్ షీట్లు, ప్రొవిజినల్, కన్సాలిడేటెడ్)
- అన్ని స్కోరు కార్డులు (టోఫెల్/ ఐఈఎల్‌టీఎస్, జీఆర్ఈ, జీమ్యాట్ మొ॥వి)
- ఎక్స్‌ట్రా కరిక్యులర్ ఆక్టివిటీస్ సర్టిఫికెట్లు
- ఫైనాన్షియల్ డాక్యుమెంట్లు (సీఏ, సీఈ రిపోర్టులు, అఫిడవిట్ ఆఫ్ సపోర్ట్ మొ॥వి).

## 3 డాక్యుమెంటేషన్- ఆర్థికాంశాలు

తల్లిదండ్రులు దరఖాస్తు ప్రక్రియ సమయంలోనే ఆర్థిక సంబంధ అంశాలను చూసుకోవాలి. అప్పుడే చివరి నిమిషంలో ఒత్తిడికి గురవకుండా ఉండొచ్చు. వీసా దరఖాస్తుకు ముందే వీటిని గమనించాల్సిన అవసరముంది.

విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చు విశ్వవిద్యాలయం, అది నెలకొన్న ప్రదేశంపై ఆధారపడి ఉంటుంది. ఐ-20లో ఒక సంవత్సరానికి సుమారుగా ఎంత ఖర్చవుతుందో ముద్రించి ఉంటుంది. ఇమిగ్రేషన్ నిబంధనల ప్రకారం.. విద్యార్థి ఐ-20లో ఉన్న మొత్తం కంటే/దానితో సమానంగా లిక్విడ్ ఫండ్స్ చూపించవచ్చు.

రెండు సంవత్సరాల ట్యూషన్ ఫీజు, ఏడాది జీవన వ్యయాన్ని చూపించడం ఎల్లప్పుడూ మంచిది.

స్పాన్సర్‌గా ఉండే వ్యక్తి దరఖాస్తుదారు, తల్లిదండ్రులు, తాతయ్య-అమ్మమ్మ/నానమ్మ, దగ్గరి బంధువులు ఇలా ఎవరైనా అవ్వొచ్చు. కానీ వారు తప్పకుండా లిక్విడ్ ఫండ్స్‌తోపాటు, ఫిక్స్‌డ్ అసెట్‌లనూ చూపించాల్సి ఉంటుంది.



## 4 ముఖాముఖిలో...

అన్ని డాక్యుమెంట్లూ సిద్ధం చేసుకుంటే పేపర్ వర్క్ పూర్తయినట్టు. ఇవన్నీ తప్పని సరిగా సిద్ధం చేసుకోవాల్సిందే. దీంతోపాటు వీసా ముఖాముఖి (ఇంటర్వ్యూ)కి కూడా అంతే ప్రాముఖ్యం ఉంది. ఆస్ట్రేలియా, కెనడా, యు.కె. ఇంకా చాలా దేశాలకు వెళ్ళాలంటే వీసా ఇంటర్వ్యూ ఉండదు. ఆ దేశాల్లో డ్రాప్ బాక్స్ పద్ధతిని అనుసరిస్తారు. కానీ వీసా ఇంటర్వ్యూను నిర్వహించే కొద్ది దేశాల్లో యు.ఎస్.ఎ. ఒకటి.

### సూటిగా... క్లుప్తంగా

- ■ వరుసక్రమంలో నిల్చున్నప్పటి నుంచే విద్యార్థులను గమనిస్తూ ఉండొచ్చు. అంటే, వరుసలో నిల్చున్నప్పుడు విద్యార్థి ప్రవర్తన, వైఖరి, వ్యక్తిత్వం లాంటి అంశాలను అంచనావేసే అవకాశమూ ఉంది.
- ■ వీసా ఇంటర్వ్యూ వ్యవధి చాలా కొద్ది సమయమే ఉంటుంది. సగటున 2 నుంచి 5 నిమిషాల్లో ఇది ముగుస్తుంది. ఎప్పుడైనా అంతకంటే ఎక్కువ సమయమూ తీసుకోవచ్చు. అందువల్ల విద్యార్థి చెప్పే సమాధానాలు క్లుప్తంగా, సూటిగా ఉండాలి.
- ■ వీసా ప్రశ్నలు సాధారణంగా విద్యార్థి చుట్టూ, చదవబోయే విశ్వవిద్యాలయం చుట్టూ తిరుగుతాయి. ఎందుకీ యూనివర్సిటీని ఎంచుకున్నారు, కోర్సు తర్వాత ఏం చేద్దామనుకుంటున్నారు.. ఇలాంటి ప్రశ్నలను అడుగుతారు. విద్యార్థి వ్యక్తిగతం, కుటుంబం, భవిష్యత్తు ఆలోచనల గురించిన ప్రశ్నలు కూడా ఎదురవుతాయి.



- ■ అమెరికాలో కోర్సు పూర్తయ్యేంతవరకు సరిపోయేంత డబ్బులు ఉన్నాయని విద్యార్థి ఆర్థికపత్రాలు, స్పాన్సర్ వివరాల ఆధారంగా వీసా అధికారికి నమ్మకం కలగాలి. స్పాన్సర్ వార్షికాదాయం, ఒకవేళ అప్పులుంటే వాటి వివరాలు పేర్కొనాలి. విద్యార్థి సమర్పించే వివరాలన్నింటినీ సాధికారికంగా బలపరిచే ఆర్థికపత్రాలను సమర్పించాలి.
- ■ ఆత్మవిశ్వాసంతో సమాధానాలు చెప్పటం చాలా ప్రధానం. చెప్పే విషయంపై అవగాహన, మాటల్లో స్పష్టత అవసరం.
- ■ హడావుడిగా జవాబులు చెప్పకూడదు. అలాగే అతివిశ్వాసం ప్రదర్శించకూడదు.
- ■ నిపుణులు నిర్వహించే నమూనా ఇంటర్వ్యూల్లో పాల్గొడం మంచిదే. ఎక్కడ తడబాటుకు గురవుతున్నారో, ఎక్కడ లోపాలున్నాయో గుర్తించి, వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి మెరుగుపరచుకునే వీలుంటుంది.
- ■ ముందస్తుగా తగిన విధంగా సన్నద్ధమై ముఖాముఖికి హాజరైతే వీసా మంజూరయ్యే అవకాశాలు ఎక్కువ.

# నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

**డబ్ల్యూబీయూటీ, కోల్‌కతా**

**పోస్టు:** ప్రొఫెసర్/ అసోసియేట్ ప్రొఫెసర్/ అసిస్టెంట్ ప్రొఫెసర్ **ఖాళీలు:** 27 **అర్హత:** బీఈ/ బీటెక్/ ఎంఎస్సీ/ నెట్/ స్లెట్/ సెట్/ పీహెచ్‌డీ **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో **చివరితేది:** 30.01.2018 **వెబ్‌సైట్:** www.wbut.ac.in

**నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్**

**పోస్టు:** సూపరింటెండెంట్, అసిస్టెంట్, యూడీసీ తదితర పోస్టులు
**ఖాళీలు:** 11 **అర్హత:** డిగ్రీ/ డీఫార్మసీ/ బేసిక్ నర్సింగ్. **ఎంపిక:** నిబంధనల ప్రకారం **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ **చివరితేది:** 28.12.2017
**వెబ్‌సైట్:** https://www.nitie.edu/

**యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్**

**పోస్టు:** ప్రాజెక్ట్ స్టాఫ్
**ఖాళీలు:** 09
**అర్హత:** ఎంఎస్సీ/ ఎంసీఏ/ ఎంటెక్/ ఎంబీఏ.
**ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
**చివరితేది:** 29.12.2017
**వెబ్‌సైట్:** https://www.uohyd.ac.in/

### వాక్ ఇన్ ఇంటర్వ్యూ

**సీఎస్ఐఆర్ మద్రాస్ కాంప్లెక్స్**

**పోస్టు:** ప్రాజెక్ట్ అసిస్టెంట్
**ఖాళీలు:** 01
**స్టైపెండ్:** రూ.25,000
**అర్హత:** బీఈ/ బీటెక్
**ఇంటర్వ్యూ తేది:** 18.12.2017
**వెబ్‌సైట్:** www.csircmc.res.in

**సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైకియాట్రీ**

**పోస్టు:** రీజనల్ టెక్నికల్ ఆఫీసర్, తదితర పోస్టులు
**ఖాళీలు:** 02
**అర్హత:** ఇంటర్/ టైపింగ్/ పీజీ ఇన్ సైకియాట్రీ/ ఎంఫిల్.
**ఇంటర్వ్యూ తేది:** 19.12.2017
**వెబ్‌సైట్:** http://cipranchi.nic.in/

**మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ**

**పోస్టు:** ఐటీ ప్రొఫెషనల్/ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్.
**ఖాళీలు:** 04
**అర్హత:** బీఈ/ బీటెక్/ బీకాం/ ఎంకాం/ సీఏ/ ఐసీడబ్ల్యూఏ.
**ఇంటర్వ్యూ తేది:** 21.12.2017
**వెబ్‌సైట్:** www.manuu.ac.in

### ప్రవేశాలు

**అన్నా యూనివర్సిటీ, చెన్నై**

**కోర్సులు:** ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్
**నిర్వహణ విధానం:** దూరవిద్య
**అర్హత:** ఏదైనా డిగ్రీ.
**ఎంపిక:** ప్రవేశపరీక్ష ద్వారా
**దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్
**చివరితేది:** 24.02.2018
**వెబ్‌సైట్:** http://cde.annauniv.edu/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం **www.eenadupratibha.net** చూడవచ్చు.